
సాక్షి
కామారెడ్డి
బుధవారం । 12 । మార్చి । 2025



రాత పరీక్ష ద్వారా..

కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌ను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తున్నామని ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు తెలిపారు.

- 9లో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్ బుధ : 6:31 | సహర్ గురు : 5:04

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.2 /17.9

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలీస్ స్టేషన్ తనిఖీ



భిక్కనూరు : ఎస్పీ రాజేశ్ చంద్ర మంగళవారం భిక్కనూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, కేసుల విషయంలో నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట స్థానిక సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

సౌత్ క్యాంపస్‌ను సందర్శించిన వీసీ



భిక్కనూరు: తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్‌ను మంగళవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ యాదగిరిరావు సందర్శించారు. క్యాంపస్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. వసతి గృహాలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా చూశారు. డ్రెయినేజీ సమస్యను వారం రో జుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నీటి సమస్య తలెత్తకుండా చూడా లన్నారు. బాలికలు, బాలుర హాస్టళ్లు, వంటశాలలను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని, బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని సూచించారు. వీసీ వెంట యూనివర్సిటీ ఏఈ వినోద్, సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు యాలాద్రి, సునీత, మోహన్ బాబు, నాగరాజు, నారాయణ, రమాదేవి ఉన్నారు.

ఎస్‌జేఎం రాష్ట్ర యువ ప్రముఖ్‌గా రాహుల్ నేత



కామారెడ్డి అర్బన్ : స్వదేశీ జాగరణ్ మంచ్(ఎస్‌జేఎం) రాష్ట్ర యువ ప్రముఖ్‌గా దేవునిపల్లికి చెందిన వంగ రాహుల్ నేత నియమితులయ్యారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో ఈనెల 9, 10 తేదీలలో నిర్వహించిన అఖిల భారత స్వదేశీ జాగరణ్ మంచ్ సమావేశాల్లో జాతీయ కన్వీనర్ ఆర్. సుందరం తనకు ఈ బాధ్యత అప్పగించారని రాహుల్ నేత తెలిపారు.

‘ఏ పార్టీతోనూ సంబంధం లేదు’



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తమకు ఏ పార్టీతోనూ సంబంధం లేదని కామారెడ్డి సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్నాథం పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల విడుదలైన యాభై సంవత్సరాల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం అనే పుస్తకంలో తమ సంస్థ ఇతర సంస్థల ప్రోద్బలంతో ఏర్పడినట్లు పేర్కొనడాన్ని ఖండించారు. నాలుగు దశాబ్దాల క్రితం విద్యాధికులైన యువకులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, డాక్టర్లు, న్యాయవాదులతో కలిసి కామారెడ్డి సిటిజన్స్ అసోసియేషన్ ఏర్పాటయ్యిందన్నారు. ప్ర జాస్వామిక పద్ధతుల్లో ఎన్నో సామాజిక స మస్యలపై పోరాటాలు చేశామన్నారు. సంపూర్ణ మద్య నిషేధం కోసం ఉద్యమించామని, బీడీ కార్మికులు, వృత్తి కార్మికుల హక్కుల కోసం జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నామని పేర్కొన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ క్రియాశీలక పాత్ర పోషించామన్నారు. తమ సంస్థకు ఏ సంస్థతోనూ సంబంధాలు లేవని స్పష్టం చేశారు.

17న వాహనాల వేలం

కామారెడ్డి క్రైం: వివిధ కేసుల్లో పట్టుబడి కామారెడ్డి ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో ఉన్న వాహనాలను ఈనెల 17 న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కార్లు, ఒక ఆటో, ఐదు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తామని ప్రకటించారు. ఆసక్తిగలవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి, వేలంలో పాల్గొనాలని సూచించారు.

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా తగ్గుతుంది. ప్రస్తుతం 27 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.



మద్నూర్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనం నిర్మించే స్థలం

విద్యా హబ్‌గా జుక్కల్!

- నియోజకవర్గానికి తరలివస్తున్న విద్యాసంస్థలు
- గురుకులాలు, కేజీబీవీలతో చేరువైన చదువులు
- ఇప్పటికే కొనసాగుతున్న జవహర్ నవోదయ విద్యాలయం
- ఏటీసీగా ఐటీఐ కళాశాల అప్‌గ్రేడ్
- సమీకృత గురుకులం ఏర్పాటుతో మరింత ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యాభిమానులు

మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న జుక్కల్ నియోజకవర్గం విద్యాహబ్‌గా మారుతోంది. ఇక్కడ నాలుగు దశాబ్దాల క్రితమే నవోదయ విద్యాలయం ఏర్పాటు కాగా.. ఏడాది క్రితం కేంద్రీయ విద్యాలయం కూడా మంజూరయ్యింది. ఐటీఐ కళాశాల ఏటీసీగా అప్‌గ్రేడ్ అయ్యింది. తాజాగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు రూ. 200 కోట్లు మంజూరు చేస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలో విద్యాసంస్థలు ఏర్పాటవుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వెనకబాటుకు గురైన జుక్కల్ నియోజక వర్గంలో విద్యారంగం అభివృద్ధి సాధిస్తోంది. నిజాంసాగర్ మండలం అచ్చంపేటలో నాలుగు దశాబ్దాల క్రితమే జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటైంది. అక్కడే ఎస్సీ గురుకుల పాఠశాల, మోడల్ స్కూళ్లు ఉన్నాయి. పిట్లం మండల కేంద్రంలో రెండు గురుకులాలు, బిచ్కుందలో ఒక గురుకులం ఉన్నాయి. మద్నూర్ మండలంలో ఇప్పటికే రెండు గురుకుల పాఠశాలలున్నాయి. బిచ్కుంద మండల కేంద్రంలో మైనారిటీ గురుకులం, జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ప్రైవేటు రంగంలో బీఈడీ కాలేజీ కొనసాగుతున్నాయి. మద్నూర్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటైంది. నిజాంసాగర్, పిట్లం, మద్నూర్, జుక్కల్, బిచ్కుంద మండలాల్లో జూనియర్ కాలేజీలున్నాయి. అన్ని మండలాల్లో కేజీబీవీలు, సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి.

సమీకృత గురుకులానికి రూ. 200 కోట్లు..

జుక్కల్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేసిన సర్కారు.. ఇటీవల భవన నిర్మాణం కోసం రూ. 200 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మద్నూర్‌లో ఈ విద్యాసంస్థ భవనాన్ని నిర్మించనున్నారు. ఇప్పటికే భవన నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. 25 ఎకరాల విస్తీర్ణంలో స్కూల్ భవనాలను నిర్మించనున్నారు. 2,500 మంది విద్యార్థులు చదువుకునేలా ఆధునిక సదుపాయాలతో దీన్ని నిర్మించనున్నారు. రెండేళ్లలో నిర్మాణం పూర్తవుతుందని భావిస్తున్నారు.

కేంద్రీయ విద్యాలయం..

జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలానికి కేంద్రీయ విద్యాలయం మంజూరయ్యింది. అయితే పాఠశాల నిర్వహణకు ఇరవై గదులు ఉన్న భవనం అవసరం ఉంది. భవనం దొరక్కపోవడంతో కేంద్రీయ విద్యాలయ ప్రారంభానికి నోచుకోవడం లేదు. అది ఏర్పాటైతే ఆ ప్రాంత విద్యార్థులకు మేలు కలుగుతుంది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కేంద్రీయ విద్యాలయ అధికారులతో మాట్లాడారు. మద్నూర్‌లో కావాల్సినంత ప్రభుత్వ స్థలం ఉందని, కేంద్రీయ విద్యాలయానికి నిధులు ఇస్తే భవనం నిర్మిస్తామని సూచించారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌గా..

యువతకు స్కిల్ కోర్సులు అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు ప్రభుత్వ ఐటీఐ కళాశాలను ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)లుగా అప్‌గ్రేడ్ చేసింది. ఇందులో బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల కూడా ఉంది. టాటా సంస్థ సహకారంతో ఆయా కోర్సుల్లో నైపుణ్యాలు నేర్చుకునేలా శిక్షణ ఇస్తారు. ఏటీసీ సెంటర్‌లో నిష్ణాతులను తయారు చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. బిచ్కుందలో ఉన్న సెంటర్‌తో ఈ ప్రాంత విద్యార్థులకు మేలు జరుగుతుంది.

విద్యాభివృద్ధికి అడుగులు



వెనకబడిన జుక్కల్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. విద్యాసంస్థలు ఏర్పాటవుతుండడంతో ఈ ప్రాంత విద్యార్థులకు మేలు జరుగుతుంది. జుక్కల్ నియోజకవర్గం విద్యాహబ్‌గా మారుతున్నందుకు సంతోషంగా ఉంది.

– బసవరాజ్ పటేల్, అడ్వకేట్, నిజాంసాగర్

మేలు జరుగుతుంది



జుక్కల్ నియోజకవర్గంలో ఏర్పాటవుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌తో ఈ ప్రాంత పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ఉన్నత విద్యావకాశాలు మెరుగుపడతాయి. ఎమ్మెల్యే విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. – సాయినిఖిల్ గౌడ్, ఎంఫార్మసీ, చిల్లర్గి, పిట్లం మండలం



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- దరఖాస్తుదారులందరికీ సమాచారం ఇవ్వాలి
- నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలి
- మున్సిపల్ అధికారులతో సమీక్షలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్ : అనధికార లేఅవుట్లు, వ్యక్తిగత ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్ల ద్వారా సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. రాయితీ నెలాఖరు వరకే వర్తిస్తుందన్న విషయాన్ని దరఖాస్తుదారులకు తెలియజేయాలన్నారు. రోజూ ఎల్‌ఆర్‌ఎస్‌పై సమీక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని బల్దియా అధికారులకు సూచించారు. వేసవి కాలం దృష్ట్యా మొక్కలకు వాటరింగ్ నిర్వహించాలన్నారు. అవసరమైన ట్యాంకర్‌లను కొనుగోలు చేయాలని, పార్కుల్లో చిన్న పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన పరికరాలు, జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్స్‌ను తొలగించాలని, పర్మిషన్ ఉన్న హోర్డింగ్స్‌పై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించాలని సూచించారు. డిమాండ్ మేరకు ప్రాపర్టీ టాక్స్ వసూలు చేయాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌లైన్ డెస్క్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డీఈ వేణుగోపాల్, ఏఈ శంకర్, టీపీఎస్ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీని చూసి.. కొండెంగ అనుకుని..



విద్యుత్ సబ్ స్టేషన్ గేటుకు కొండెంగ ఫొటోతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ఎక్కడ విద్యుత్ షాక్ కొడుతుందేమోనన్న భయంతో చాలామంది సబ్‌స్టేషన్ పరిసరాలకు వెళ్లేందుకు జంకుతారు. కానీ కోతులు మాత్రం రామారెడ్డి మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లోకి వెళ్లి మరీ హంగామా సృష్టిస్తున్నాయి. దీంతో వాటికి చెక్ పెట్టేందుకు సిబ్బంది ఆలోచన చేశారు. కొండెంగ ఫ్లెక్సీలు తయారు చేయించి ప్రధాన గేటుకు కట్టారు. దీంతో నిజంగా కొండెంగ ఉందేమోనని భయపడుతున్న కోతులు.. అటువైపే వెళ్లడం లేదు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

ఘనంగా లెంగి ఉత్సవం

గాంధారి : మండల కేంద్రంలోని సేవాలాల్ మందిరం వద్ద మంగళవారం గిరిజనుల సంప్రదాయ లెంగి (హోలీ) ఉత్సవం నిర్వహించారు. వేడుకల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రావు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి హోలీ పాటలు పాడుతూ నృత్యం చేశారు. కార్యక్రమంలో పలు తండాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి టౌన్ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 10,720 మంది విద్యార్థులకుగాను 10,321 మంది హాజరయ్యారు. 399 మంది గైర్హాజరయ్యారు. జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పరీక్షలను పర్యవేక్షించారు.

షబ్బీర్‌కు మొండిచేయి!

- ఎమ్మెల్సీ పదవి దక్కకపోవడంతో నిరాశ
- ఆవేదనకు గురవుతున్న అనుచరులు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎమ్మెల్సీ అవకాశం దక్కుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి కాంగ్రెస్ నాయకత్వం మొండిచేయి చూపింది. దీంతో ఆయన అనుచరులు నిరాశకు గురయ్యారు.

విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చిన షబ్బీర్ అలీ.. కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. మండల వ్యవస్థ ఏర్పాటైన తొలినాళ్లలో మాచారెడ్డి ఎంపీపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 1989లో కామారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించి వెనువెంటనే మంత్రి పదవిని సాధించారు. 1994, 1999 ఎన్నికల్లో టీడీపీ హవాలో ఆయన ఓటమి పాలయ్యారు. 2004లో దివంగత సీఎం వైఎస్సార్ నాయకత్వంలో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన షబ్బీర్ గెలుపొంది మరోసారి మంత్రిగా అవకాశం పొందారు. ఐదేళ్ల పాటు వైఎస్సార్‌కు అత్యంత సన్నిహితుడిగా మెలిగారు. 2009 ఎన్నికల్లో ఓడిపోవడంతో పార్టీ ఆయనకు ఎమ్మెల్సీ అవకాశం ఇచ్చింది. ఆయన కొంతకాలం మండలి ప్రతిపక్ష నేతగా పని చేశారు. 2014, 2018 ఎన్నికల్లోనూ షబ్బీర్ అలీకి ఓటమి తప్పలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా కామారెడ్డి నుంచి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి బరిలో దిగడంతో షబ్బీర్‌అలీ నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేశారు. అక్కడా ఆయనకు ఓటమి తప్పలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఆయన ఎమ్మెల్యేగా గెలవకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. అయితే మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి మంత్రి పదవి ఇస్తారని ఆయన అనుచరులు ఆశించారు. కానీ ప్రభుత్వం ఆయనకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖలకు ప్రభుత్వ సలహాదారు పదవితో సరిపెట్టింది.

న్యాయం చేయాలంటూ నేతల డిమాండ్

షబ్బీర్ అలీకి ప్రాధాన్యత ఇవ్వాలంటూ జిల్లా కాంగ్రెస్ నేతలు గొంతు విప్పుతున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి తమ నాయకుడికి ఎమ్మెల్సీ, మంత్రి పదవి విషయంలో పార్టీ నాయకత్వం ఆలోచించాలని కోరారు. అలాగే జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి కూడా షబ్బీర్ అలీకి పార్టీ న్యాయం చేయాలని కోరుతున్నారు. మైనారిటీ వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. తమ నాయకుడికి పార్టీ న్యాయం చేయాలని కోరారు.

అవకాశం లేనట్లే..

శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీ అవకాశం ఇస్తా రని షబ్బీర్ అలీ ఆశించారు. ఎమ్మెల్సీ అయితే మైనారిటీ నేతగా మంత్రివర్గంలో స్థానం దక్కుతుంద ని భావించారు. తీరా అభ్యర్థుల జాబితాలో షబ్బీర్ అలీ పేరు లేకపోవడంతో ఆయన నిరాశకు గురయ్యారు. దీనికి తోడు ఇప్పట్లో ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయ్యేవి కూడా లేకపోవడంతో ఆయనకు అవకాశాలు దొరక్కపోవచ్చని అంటున్నారు.

ప్రమాదకరంగా మర్రి చెట్లు

- విరిగి పడుతున్న కొమ్మలు
- గాయాల పాలవుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

లింగంపేట : రోడ్డుకు ఇరువైపులా పెరిగిన మర్రి వృక్షాలు ప్రమాదకరంగా మారాయి. భారీ వృక్షాల కొమ్మలు విరిగి మీదపడుతుండడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో రోడ్డుకు ఇరువైపులా భారీ వృక్షాలున్నాయి. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెట్ల ఊడలు పెరిగి పలుచోట్ల రోడ్డును కమ్మేశాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లే భారీ వాహనాలకు ఆ ఊడలు తగిలి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే వర్షాకాలంలో, బలమైన గాలులు వీచిన సమయంలో కొమ్మలు విరిగి పడుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగి పలువురు గాయాల పాలైన ఘటనలూ ఉన్నాయి. ప్రమాదకరంగా మారిన కొమ్మలను తొలగించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు.. ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే మూలమలుపుల్లోనూ పలుచోట్ల భారీ మర్రి చెట్లున్నాయి. వీటివల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



మెంగారం శివారులో విరిగిపడిన కొమ్మలు(ఫైల్)

ప్రమాదాల వివరాలు..

- ఈనెల 5వ తేదీన మెంగారం శివారులో మర్రి కొమ్మలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో బైక్‌పై వెళ్తున్న అన్నం సాయిలుపై కొమ్మలు పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు.
- గతనెలలో జీవదాన్ ఆస్పత్రి ముందు కలప లోడ్‌తో వెళ్తున్న లారీకి మర్రి ఊడలు తగలడంతో అదుపుతప్పి మిషన్ భగీరథ వాల్‌ను ఢీకొట్టింది. ఘటనలో లారీడ్రైవర్‌కు గాయాలయ్యాయి. మిషన్ భగీరథ నీరు వృథాగాపోయింది.
- కొన్నేళ్ల క్రితం లింగంపేట అంబేడ్కర్ చౌరస్తా ప్రాంతంలోని జలరాం హోటల్ ముందు భారీ మర్రి వృక్షం కూలిపోయింది. అక్కడ ఉన్న సురాయిపల్లి గ్రామానికి చెందిన విఠల్‌రెడ్డిపై పడడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వెంటనే హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- గతంలో లింగంపేట పోలీస్ స్టేషన్ సమీపంలోని మూల మలుపు వద్ద మర్రి చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.

చర్యలు తీసుకోవాలి



కేకేవై రోడ్డుకు ఇరువైపులా ఉన్న మర్రి చెట్ల కొమ్మలు విరిగిపడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చెట్ల కొమ్మలు విరిగిపడి గ్రామానికి చెందిన పలువురు గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అ ధికారులు స్పందించి, కొమ్మలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. – మాకం రాములు, మెంగారంవాసి

మూల మలుపుల్లో..



వర్షాకాలంలో ఎప్పుడు చెట్లు కూలిపోతాయో, ఎక్కడ కొమ్మలు విగిరి పడతాయో తెలియని పరిస్థితి ఉంటోంది. అలాగే మూల మలుపుల్లో చెట్లు ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటితోపాటు రోడ్డుపైకి వాలిన కొమ్మలు, ఊడలను తొలగించాలి.

– సిద్దాగౌడ్, లింగంపేటవాసి

కొమ్మలు తొలగిస్తున్నాం

చెట్లను తొలగించడానికి వీలులేదు. ప్రమాదకరంగా ఎక్కడైనా కొమ్మలు వంగి ఉంటే వాటిని తొలగిస్తున్నాం. ఇంకా ఎక్కడైనా ఉంటే మా దృష్టికి తీసుకువస్తే వాటినీ తొలగిస్తాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– రవితేజ, ఏఈ, ఆర్‌అండ్‌బీ

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గాలీపూర్‌లో రూ.5 లక్షల నిధులతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు హన్మాండ్లు, నాయకులు సాయాగౌడ్, భూంరెడ్డి, కాశీరాం సిద్దుపటేల్, తదితరులున్నారు.

అవాల్‌గావ్‌లో..

మద్నూర్(జుక్కల్): అవాల్‌గావ్‌లో మంగళవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.10 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు ప్రారంభించారు. నాయకులు దత్తప్ప స్వామి, గంగాధర్, ప్రమోద్ పటేల్, మారుతి, సదాశివపటేల్, వినోద్‌పటేల్, అముల్ పాల్గొన్నారు.

పరీక్షా ప్యాడ్ల పంపిణీ

భిక్కనూరు: జంగంపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు లింబాద్రి, రాజు, ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నకొడప్‌గల్‌లో..

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్‌గల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 52 మంది పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి బాలు, సభ్యులు నారాయణరెడ్డి, రాజు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఉపాధిహామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు. మండల పరిషత కార్యాలయంలో మంగళవారం వివిధ జీపీల కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టిన ఇంటి పన్నుల వసూళ్లకు సంబంధించి రసీదుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దీంతో పాటు ప్రతిరోజూ శానిటేషన్ రిపోర్టును ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం మాల్తుమ్మెద శివారులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి పలు సూచనలు, సలహాలిచ్చారు.

క్యాసంపల్లి తండాలో అధికారుల పర్యటన



క్యాసంపల్లి తండాలో నీటి సమస్యను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ అధికారులు

కామారెడ్డి రూరల్: క్యాసంపల్లి తండాలో మంగళవారం అధికారులు పర్యటించారు. క్యాసంపల్లి తండాలో 'కన్నీటి' కష్టాలు అనే శీర్షికతో వార్తా కథనం 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైంది. దీంతో మిషన్ భగీరథ ఈఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేశ్, డీపీవో మురళీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఎంపీవో హెప్సిబారాణిలు అక్కడికి వెళ్లి తండావాసులతో మాట్లాడి నీటి సమస్యలు తెలుసుకున్నారు. తమ తండాలో నెలకొన్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి సమస్యను పరిష్కరించిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

చెట్లు నరికి పందిరేశారు

నిజాంసాగర్(జుక్కల్): ఎండలు మండుతుండటంతో ఉపాధి కూలీలు భానుడి ప్రతాపానికి గురవకుండా ఈజీఎస్ అధికారులు తగు చర్యలు చేపట్టారు. ఉపాధిపై భానుడి ప్రతాపం అంటూ ఈ నెల 7న సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. పనుల వద్ద కూలీలకు నీడ సదుపాయం కల్పించాలని ఫీల్డ్‌అసిస్టెంట్లను ఆదేశించారు. దీంతో హసన్‌పల్లి గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద ఉపాధి కూలీలకు పచ్చని పందిరి వేశారు. హరిత లక్ష్యానికి తూట్లు పొడుస్తూ..అటవీ ప్రాంతంలో చెట్లను నరికి పందిరి వేయడం గమనర్హం. పని ప్రదేశంలో టెంట్లు వేసి నీడ కల్పిస్తే పోయేదానికి అనవసరంగా చెట్లు నరికేశారు.



హసన్‌పల్లిలో ఉపాధి పనుల వద్ద వేసిన పందిరి

'యుద్ధాలతో ప్రపంచ వినాశనమే'

కామారెడ్డి అర్బన్: యుద్ధాలు ప్రపంచశాంతికి విఘాతం కలిగిస్తాయని, అగ్రరాజ్యాల ఆయుధాల వ్యాపారం, ఖనిజ సంపద దోపిడీ, దురాక్రమణ అంశాలుంటాయని పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్లు మహ్మద్ గౌస్, వెంకటరమణలు అన్నారు. మంగళవారం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'పశ్చిమ ఆసియా, ఉక్రెయిన్ సంక్షోభం–ప్రపంచ శాంతిపై ప్రభావం' అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించి మాట్లాడారు. అగ్రరాజ్యాల ఆధిపత్య పోరులో చిన్నదేశాలు విలవిలాడుతున్నాయన్నారు. ప్రపంచ శాంతితోనే సమసమాజ స్థాపన జరుగుతుందన్నారు. ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.కిష్టయ్య, సమన్వయకర్తలు పి.విశ్వప్రసాద్, అంకం జయప్రకాష్, గణేష్, సుధాకర్, పరిపాలన శాస్త్ర విభాగాధిపతి రాములు, దినకర్, అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, రాజ్‌గంభీర్‌రావు, చంద్రశేఖర్‌గౌడ్, గౌతమి, ఫర్హీన్ ఫాతిమా, మానస, అనిల్ తదితరులు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొన్న ప్రొఫెసర్లు వెంకటరమణ, మహ్మద్ గౌస్‌లను సన్మానించారు.



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రొఫెసర్లు, అధ్యాపకులు

అశోక్‌నగర్‌కు 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అనుసంధానం



కామారెడ్డి అర్బన్: వేసవి దృష్ట్యా విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని స్థానిక అశోక్‌నగర్ కాలనీ ఎస్ఎస్236 ట్రాన్స్‌ఫార్మర్‌ను వంద నుంచి 160 కేవీఏకు పెంచి మంగళవారం అనుసంధానం చేశారు. అశోక్‌నగర్ కాలనీవాసులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని, సమస్యలుంటే 1912 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఈ శ్రావణ్ కుమార్ వినియోగదారులకు సూచించారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయాన్ని డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. సర్కిల్ పరిధిలో మత్తు పదార్థాల రవాణా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, గుడుంబా, సారా కాయకుండా అవగాహన కల్పించాలని అన్నారు. సీఐ షాకీర్ అహ్మద్, ఎస్సై జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

నాగన్నగారి మెట్ల బావిని సందర్శించిన విద్యార్థులు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శిశుమందిర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం క్షేత్ర పర్యటనలో భాగంగా నాగన్నగారి మెట్ల బావిని సందర్శించారు. ఈ సందర్భంగా మెట్ల చరిత్రను, పునర్నిర్మాణం జరిగిన తీరును విద్యార్థులకు మాతాజీలు వివరించారు. మాతాజీలు సుమలత, లావణ్య, ప్రియాంక, సునంద, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పొందడం అభినందనీయం

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

దోమకొండ: మహిళలు డ్వాక్రా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధి పొందడం అభినందనీయమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం దోమకొండ మండల పరిషత్ కార్యాలయ పాత భవనంలో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించి మాట్లాడారు. మహిళలు స్వశక్తితో ఎదగాలని, వారికి ప్రజాప్రతినిధులు అధికారులు సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐకేపీ జిల్లా అధికారులు సుధాకర్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్ రావు, ఐకేపీ ఏపీఎం రాజు, బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్ రెడ్డి, తదితరులున్నారు.



మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన అనంతరం డ్వాక్రా మహిళలతో ఎమ్మెల్యే

ఆధ్యాత్మికం

ఘనంగా బోనాల పండుగ

భిక్కనూరు: సిద్ధరామేశ్వరనగర్‌లో మంగళవారం వీడీసీ ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. భక్తులు శోభాయాత్రగా వెళ్లి గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.

ఎల్లమ్మకు బోనాలు



లింగంపేట(ఎల్లారెడ్డి): బోనాల్ గ్రామంలో గ్రామ దేవత ఎల్లమ్మకు మంగళవారం బోనాలు సమర్పించారు. గ్రామస్తులు ఇంటింటికి బోనం తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

సోమర్యాగడితండాలో సేవాలాల్ స్వాముల పూజలు

ఎల్లారెడ్డిరూరల్: సోమర్యాగడితండాలో సేవాలాల్ స్వాములు మంగళవారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి నుంచి శ్రీరామ నవమి వరకు 41 రోజుల పాటు మండల దీక్షలు చేపట్టిన స్వాములు భోగ్‌బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అభ్యసన సామర్థ్యం పెరిగేలా కృషి చేయాలి

బాన్సువాడ రూరల్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కామారెడ్డి డీఈవో రాజు అన్నారు. మంగళవారం ఆయన బోర్లం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలలకు వచ్చేలా వారిలో ఆసక్తిని పెంపొందించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంతకు ముందు ఆయన బాన్సువాడ మండల ప్రత్యేకాధికారి హోదాలో గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించి పంచాయతీ కార్యదర్శి సాయికుమార్‌కు పలు సూచనలు చేశారు. డీఎల్‌పీవో సత్యనారాయణ, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంఈవో నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ గెంట్యాల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బోర్లం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో డీఈవో రాజు

జిల్లా గ్రంథాలయ సంస్థలో మహిళా దినోత్సవం

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో గ్రంథాలయ సంస్థ, జిల్లా కోర్టు మహిళా సిబ్బందిని చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సిబ్బందితో పాటు పాఠకులు పాల్గొని సన్మాన గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.



'బంగారానికి హాల్‌మార్క్ తప్పనిసరి'



కామారెడ్డి అర్బన్: బంగారం కొనుగోలు విషయంలో బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) సూచించిన హాల్‌మార్క్ తప్పనిసరిగా పరిశీలించాలని బీఐఎస్ ప్రతినిధి ప్రశాంతి అన్నారు. మంగళవారం పట్టణ స్వర్ణకార భవనంలో బీఐఎస్ హాల్‌మార్క్‌పై స్థానిక బంగారు, వెండి వ్యాపారులు దాదాపు 70 మందికి అవగాహన సమావేశం నిర్వహించారు. బంగారు ఆభరణాల కొనుగోలులో మోసాలను అరికట్టడానికి హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రశాంతి అన్నారు. సమావేశంలో బీఐఎస్ హాల్‌మార్క్ విశ్రాంత అధికారి ఓ.వీరయ్య, బంగారు, వెండి, స్వర్ణకార వర్తకుల సంఘం ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, వై.శ్రీనివాస్, చక్రం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు బోధించారు. ఉత్తమంగా విద్యా బోధన చేసిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం వెంకన్న, ఉపాధ్యాయులు పండరి, సాయిలు, పోచయ్య, ప్రసన్న, సరస్వతి, విద్యచరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



రాజంపేట: విద్యుత్‌షాక్‌తో ఓ రైతు మృతి చెందిన ఘటన రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెట్టిగాడి రాంచంద్రం(61) మంగళవారం ఉదయం 6.30 గంటలకు గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో నీరు పారించేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పొలానికి వెళ్లి చూడగా బోరు మోటార్ వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. స్టాటర్ డబ్బాలో విద్యుత్ వైరు తగిలి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిందితుడి అరెస్టు

నందిపేట్: దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసినట్లు నందిపేట్ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నందిపేట్ మండలం వెల్మల్‌కు చెందిన కుస్తాపురం శ్రీనివాస్ తన భార్య, తండ్రితో కలిసి వ్యవసాయ పనుల కోసం పంట పొలాలకు వెళ్లాడు. ఇంటి వద్దే ఉన్న తల్లి భోజమ్మ ఉదయం 11 గంటలకు బీడీల ఖార్ఖానాకు వెళ్లింది. ఆమె తిరిగి వచ్చే సరికి ఇంటి దుండగులు చోరీకి పాల్పడ్డారు. రెండు తులాల బంగారు నగలు, పది తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కాగా ఇంటి పక్కనే ఉన్న సీసీ పుటేజీల్లో ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడి పారిపోతున్నట్లు రికార్డు అయ్యింది. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా ఎడపల్లి మండలం బ్రాహ్మణ్‌పల్లి వద్ద నిందితుడు శ్రీనివాస్‌ను పోలీసులు పట్టుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుకున్న నిందితుడి నుంచి పది తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించినట్లు ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నిజాంసాగర్: మండలంలోని అచ్చంపేట శివారులో ఉన్న నల్ల వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ మంగళవారం తెలిపారు. నల్లవాగులో ఉన్న ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

లక్కోరలో ఒకరి అదృశ్యం

వేల్పూర్: వేల్పూర్ మండలం లక్కోర గ్రామానికి చెందిన గడ్డం నరేశ్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ మంగళవారం తెలిపారు. స్థానికంగా టిఫిన్ సెంటర్ నిర్వహించే నరేశ్‌కు సోమవారం దోశ ఆర్డర్ వచ్చింది. డెలివరి చేసి వస్తానని భార్య లాస్యకు చెప్పి బైక్‌పై వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడం, ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో మంగళవారం సాయంత్రం లాస్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జంగంపల్లిలో మద్యం సీజ్



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన కందునూరి నరేశ్‌గౌడ్ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్సై డి ఆంజనేయులు మంగళవారం తెలిపారు. 24 లీటర్ల మద్యాన్ని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థి ఆత్మహత్య



శరత్ కుమార్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: కడుపునొప్పి భరించలేక పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం గర్గుల్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పల్లపు రాంబాబు మేస్త్రీ పని చేస్తున్నాడు. రాంబాబు దంపతులకు కుమార్తె మాధవి, కుమారుడు శరత్ కుమార్(16) ఉన్నారు. మాధవి కామారెడ్డిలో ఇంటర్, శరత్ కుమార్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. రోజూ మాదిరిగానే ఎవరి పనులకు వారు వెళ్లిపోయారు. మాధవి ఇంటర్ పరీక్ష రాసి మధ్యాహ్నం ఇంటికి రాగా శరత్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడి కనిపించాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. కొద్ది రోజులుగా అతడు కడుపునొప్పితో బాధపడుతున్నాడని అందుకే ఆత్మహత్యకు పాల్పడ్డాడని తండ్రి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

క్రికెట్ అంటే ప్రాణం..

ఆత్మహత్యకు పాల్పడిన శరత్‌కుమార్‌కు క్రికెట్ అంటే ప్రాణం. ఎక్కడ టోర్నమెంట్ జరిగినా వెళ్లి ఆడేవాడు. విరాట్ కోహ్లీకి వీరాభిమాని అని స్థానికులు తెలిపారు. బ్యాటింగ్‌లో చక్కని ప్రతిభ కనబరిచేవాడు. జిల్లా స్థాయి టోర్నీల్లో పాల్గొని అనేక అవార్డులు సొంతం చేసుకున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అండర్–16 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు తరపున ఆడి చక్కని ప్రతిభ కనబరిచాడు. శరత్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ విధించినట్లు ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఐదో టౌన్‌పీఎస్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతుండగా శివాజీనగర్‌కు చెందిన సూర్యభీమ్‌రావు మద్యం సేవించి పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ నూర్జహాన్ రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

జానకంపేటలో మరొకరికి..

ఎడపల్లి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తి రెండు రోజుల జైలు శిక్షను మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి విధించినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఎడపల్లి మండలం జానకంపేటలో సోమవారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ షేక్ అమీర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. జడ్జి అతనికి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సుద్దులంలో విషాద ఛాయలు

- అధికార లాంఛనాలతో సిరిసిల్ల 17వ బెటాలియన్ కమాండెంట్ అంత్యక్రియలు

కోటగిరి: సిరిసిల్ల జిల్లాలో 17వ బెటాలియన్‌కు చెందిన పోలీస్ కమాండెంట్ తోట గంగారాం(55) మృతితో కోటగిరి మండలం సుద్దులంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి లిఫ్ట్ నుంచి కింద పడిపోవడంతో మృతి చెందాడు. గంగారాం స్వగ్రామం కోటగిరి మండలం సుద్దులం కావడంతో కుటుంబీకులు, బంధువులు, మిత్రులు స్వగ్రామానికి మంగళవారం సాయంత్రం తీసుకొచ్చారు. రాష్ట్ర అడిషనల్ డీజీ సంజయ్ జైన్ గంగారాం మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాలిలో కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పోలీస్ శాఖకు చెందిన పలువురు అంత్యక్రియలకు హాజరయ్యారు.



కమాండెంట్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర అడిషనల్ డీజీ సంజయ్ జైన్

పీఎస్‌లో నిందితుడితో ఊడ్పించిన పోలీసులు

బోధన్‌టౌన్: బైక్ చోరీ కేసులో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తితో స్థానిక పీఎస్‌లో పనులు చేయించిన ఘటన బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఓ బైక్ చోరీ కేసులో నిందితుడిగా ఉన్న సదరు వ్యక్తిని సోమవారం రాత్రి విచారణ నిమిత్తం పీఎస్‌కు తీసుకొచ్చారు. కాగా నిందితుడు మంగళవారం ఉదయం పీఎస్‌లో చీపురుతో ఊడుస్తున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై సీఐ వెంకట నారాయణ వివరణ కోరగా బైక్ చోరీ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని రాత్రి పీఎస్‌కు తీసుకొచ్చామని, నిందితుడు కింద పడుకోవడం కోసం ఊడ్చాడని అన్నారు. తమ సిబ్బంది చీపురుతో శుభ్రం చేయాలని చెప్పలేదని అన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

మాచారెడ్డి: మండల కేంద్రానికి చెందిన గుండ్లపల్లి నాగరాజు అనే యువకుడు మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతి చెందాడు. స్థానికంగా టీవీ రిపేర్ చేస్తూ జీవనం సాగించే నాగరాజు చాతిలో నొప్పంటూ కుప్పకూలిపోగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

నాగిరెడ్డిపేట: బాలికకు మాయమాటలు చెప్పి మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నాగిరెడ్డిపేట మండలం ఓ గ్రామానికి చెందిన బాలికకు లింగంపల్లికలాన్ గ్రామానికి చెందిన ఓ యువకుడితో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. అతని మాయమాటలు నమ్మిన బాలికను యువకుడు మోసం చేశాడు. యువకుడిని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ సమక్షంలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాగులో పడి ఒకరి మృతి

ఎడపల్లి: ఒడ్డు నుంచి చేపలు పడుతున్న ఓ వ్యక్తి నీటిలో పడి మృతి చెందిన ఘటన ఎడపల్లి మండలం అంబం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్తల ఒడ్డెన్న(49) గ్రామ సమీపంలోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. వాగు ఒడ్డు నుంచి చేపలు పడుతున్న అతను కాలు జారి నీటిలో మునిగి మృతి చెందాడు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని న్యాల్‌కల్ గ్రామ చెరువులో గుర్తుతెలియని మృతదేహం మంగళవారం లభ్యమైనట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి వయస్సు 33–35 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ఎరుపు రంగు చెక్స్ గల షర్ట్, నలుపు రంగు ప్యాంట్, స్వెటర్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659850 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.